బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలి


దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి కాంగ్రెస్ పార్టీ అధిష్టానవర్గానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని బీసీల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు. బీసీలకు రాష్ట్ర మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించాలని అన్నారు. పేదలకు, బడుగు బలహీన వర్గాలకు అన్ని పథకాలు అందేలా, సాయం చేసేలా ప్రభుత్వం ముందుకు వెళ్లాలని దుండ్ర కుమారస్వామి అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ చెప్పినట్లుగా బీసీలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని అన్నారు.

'దివ్యాంగుల సంబురాలు'

చాదర్‌ఘాట్: తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని ప్రకటించడంపై దివ్యాంగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని కాంగ్రెస్ వికలాంగుల విభాగం చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. బుధవారం ఆయన మలక్‌పేటలో దివ్యాంగులతో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో దివ్యాంగులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగానే కాకుండా అన్ని రంగాల్లో నష్టపోయారన్నారు. వికలాంగుల సమస్యలపై అవగాహన లేని పాలన చేయడంతో వికలాంగుల సమాజం నష్టపోయిందన్నారు. అందుకే వికలాంగుల కుటుంబాలు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచాయన్నారు. నేతలు సతీష్‌గౌడ్, సురేష్, చారి, పరమేష్, వెంకన్న పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత అంబేడ్కర్


శ్రీరామణ చౌరస్తాలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల పరిధిలో బుధవారం నిర్వహించారు. పలు ప్రాంతాల్లోని అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

– ముషీరాబాద్, అంబర్‌పేట


అడిక్‌మెట్ లలితానగర్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్


అరుంధతినగర్‌లో బీఆర్‌ఎస్ యువనేత ముఠా జైసింహ...


ముషీరాబాద్ మోహన్‌నగర్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ నేత పూస రాజు...


మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి...


బాగ్‌లింగంపల్లిలో రాంనగర్ కార్పొరేటర్ రవిచారి


భోలక్‌పూర్‌లోని ఇందిరానగర్‌లో...

రేవంత్‌రెడ్డి సీఎం.. శుభపరిణామం

చిక్కడపల్లి: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని సీఎంగా నియమించడం తెలంగాణ రాష్ట్రానికి, పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి శుభపరిణామమని మాజీ సర్పంచులు, ఎంపీటీసీల, జెడ్పీటీసీలు, కార్పొరేటర్ల యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మంచాల వెంకటస్వామి, గౌరవ సలహాదారులు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి చంద్రన్నప్రసాద్ పేర్కొన్నారు. గాంధీనగర్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ... స్టూడెంట్ లీడర్ నుంచి సీఎంగా ఎదిగిన రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. దొరల పాలనపోయి అందరికీ సమన్యాయం అందించే కాంగ్రెస్‌కి అధికారలోకి రావడం హర్షణీయమన్నారు.

కమ్యూనిటీ హాల్‌లో వసతులు కల్పించాలి


ముఠా జైసింహాకు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ సభ్యులు

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ కట్టంబాయిలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో కనీస వసతులు కల్పించాలని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తనయుడు ముఠా జైసింహాకు వినతిపత్రాన్ని సమర్పించారు. స్థానికంగా నిరంతరం డ్రైనేజీ లీక్ అవుతోందని దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే డ్రైనేజీకి మరమ్మతులు చేపట్టాలని కోరారు. కమ్యూనిటీ హాల్‌లో వాచ్‌మెన్ రూమ్, కిచెన్ కోసం ప్రత్యేక గది, ప్లంబర్ పనులు, ఓవర్ హెడ్ ట్యాంకులు రెండు ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఏ విద్యార్థులకు 'అడ్వాన్స్ ఎక్సెల్'పై అవగాహన అవసరం

కాచిగూడ: ఎంబీఏ విద్యార్థులు అడ్వాన్స్ ఎక్సెల్‌పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అవంతి పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ అప్పారావు అన్నారు. బుధవారం అడ్వాన్స్ ఎక్సెల్‌పై కళాశాలలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు మంచిగా చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ మోహన్‌దాస్ మాట్లాడుతూ... కార్పొరేట్ కంపెనీలు, వందలాది మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఉద్యోగాల కోసం కళాశాలలో నిర్వహిస్తున్న సెమినార్‌లలో పాల్గొని సబ్జెక్టులను నేర్చుకొని మంచి కంపెనీలలో ఉద్యోగాలు పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సమయాన్ని వినియోగించుకుని ప్రతిభావంతులు కావాలని అన్నారు. విద్యార్థుల్లో సృజనను వెలికి తీయడానికి ఇటువంటి సెమినార్‌లు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ తబస్సుమ్, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో బీర్ల ఐలయ్యకు చోటు కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర మంత్రివర్గంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు చోటు కల్పించాలని యాదవ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట యాదవ విద్యావంతుల వేదిక, గొల్ల కురుమ విద్యార్థి సంఘం, బీసీ సంక్షేమ సంఘం, బీసీ జేఏసీ, ఓయూ జాక్ తదితర సంఘాల ఆధ్వర్యంలో బీర్ల ఐలయ్యను మంత్రివర్గంలోకి తీసుకోవాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకులు ఈరబోయిన నర్సింహయాదవ్, ఓయూ జేఏసీ నాయకులు డాక్టర్ ఎలేందర్‌కుర్మ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60 లక్షలకు పైగా జనాభా గల యాదవులకు కాంగ్రెస్ మంత్రి వర్గంలో సముచిత స్థానం కల్పించాలని కోరారు. గత మంత్రి వర్గంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు చోటు కల్పించినట్లు కాంగ్రెస్ పార్టీ నుంచి రాష్ట్రంలో ఎన్నికైన ఏకైక యాదవ ఎమ్మెల్యే, ఉన్నత విద్యావంతుడు బీర్ల ఐలయ్యకు అవకాశం కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో జూకంటి ప్రవీణ్‌కుమార్, లక్ష్మణ్‌యాదవ్, మహేందర్, పర్వతాలు, బీరప్ప, గట్టయ్య, సైదులు, పాండు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో బీసీలకు సముచిత స్థానం కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ మంత్రి వర్గంలో బీసీ ఎమ్మెల్యేలకు సముచిత స్థానం కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 54 శాతం గల బీసీలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం సరైన సంఖ్యలో అవకాశాలు కల్పించకుండా అన్యాయం చేసినందునే కాంగ్రెస్ పార్టీ విజయానికి బీసీలు కృషి చేశారని తెలిపారు. బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసి కుల గణను చేపట్టాలన్నారు. బీసీల ఆకాంక్షలకు అనుకూలంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేసి సరైన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అవగాహన ర్యాలీ

అడ్డగుట్ట: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని యాక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధులు డిమాండ్ చేశారు. మహిళలు, యువతులపై జరుగుతున్న అత్యాచారాలపై బుధవారం అడ్డగుట్ట, తుకారాంగేట్ ప్రాంతాల్లో యాక్షన్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లలకు సేఫ్ అండ్ అన్‌సేఫ్ టచ్ అంశాలపై తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచే అవగాహన కల్పించాలని సూచించారు. విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు 1098, 181 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

బీసీ ఉద్యోగులకు శుభపరిణామం

పంజగుట్ట: తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రశేఖర్ గౌడ్ ఆయకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి రావడం తెలంగాణ బీసీ ఉద్యోగులకు శుభపరిణామమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు స్నేహపూర్వకంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు పడ్డబాధలు వర్ణనాతీతమని అలాంటి నిరంకుశ ప్రభుత్వం పోయి ప్రజాస్వామ్య కాంగ్రెస్ ప్రభుత్వం రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులందరూ సంతోషంగా ఉంటారని ఆశాభావంవ్యక్తం చేశారు. ఉద్యోగులకు బకాయిపడ్డ డీఏలు, పీఆర్‌సీని కొత్త ప్రభుత్వం వెంటనే విడుదల చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించి క్రిమీలేయర్ పరిమితిని పెంచాలని వారు కోరారు. సమావేశంలో సంఘం మహిళా అధ్యక్షురాలు రమ, ఉపాధ్యక్షులు సాయికిరణ్ గౌడ్, వంశీధర్, చక్రధర్, శమీమ్, రామరాజు పాల్గొన్నారు.

ఎల్‌బీ స్టేడియంలో ఏర్పాట్ల పరిశీలన

ఉప్పల్: కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు గురువారం ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నేత మందుముల పరమేశ్వర్‌రెడ్డి తన అనుచరులతో తరలివెళ్లారు. అక్కడి ఏర్పాట్లను సీనియర్ నేత పొన్నం ప్రభాకర్‌తో కలిసి పోలీస్ ఉన్నతాధికారులతో ఏర్పాట్లపై ఆరా తీశారు. ఏర్పాట్లను దగ్గరుండి చూసుకుంటున్నట్లు పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు.

దంత సంరక్షణతో పరిపూర్ణ ఆరోగ్యం


బాలికలకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రావు

ముషీరాబాద్: దంత సంరక్షణతోనే పరిపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని గాంధీ ఆస్పత్రి రిటైర్డ్ డెంటల్ సర్జన్ డాక్టర్ ఓ.నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం భోలక్‌పూర్‌లోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో డాక్టర్ రావుస్ ఓరల్ హెల్త్ ఫౌండేషన్, డాక్టర్ నాగేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో బాలికలకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. దంతాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని ఆయన సూచించారు. దంతాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. దంత సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో పిల్లలకు భోజనాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దంత వైద్యులు డాక్టర్ అశోక్‌కుమార్, భోగరాజు, కె.దేవరాజ్, హాస్టల్ వార్డెన్ భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నుంచి మేడి పాపయ్యమాదిగ బహిష్కరణ


మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్: సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మేడి పాపయ్యను బహిష్కరిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ తెలిపారు. బుధవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వంగపల్లి మాట్లాడుతూ... జాతి పేరును అడ్డం పెట్టుకొని వ్యక్తిగత అవసరాల కోసం సంఘాన్ని వాడుకుంటూ స్వలాభార్జనే ధ్యేయంగా సంఘం పరువు పోయే విధంగా సంఘ విద్రోహక కార్యకలాపాలకు పాల్పడుతున్న మేడి పాపయ్యను ఎమ్మార్పీఎస్ నుంచి బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎమ్మార్పీఎస్ పేరును వాడుకున్నా, ఇతర కార్యక్రమాలకు పాల్పడిన తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పసలాది యాదగిరి, వరిగడ్డి చందు, జన్నారం జీవన్, దర్శారపు శ్రీకాంత్, కె.సురేష్, మనీ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుడు నటరాజ్ మృతి


నటరాజ్ భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న సీఐటీయూ నేతలు

ముషీరాబాద్: తెలంగాణ పాఠ్య పుస్తక ముద్రణాలయం కార్మిక నేత, సీఐటీయూ నాయకుడు నటరాజ్(58) మృతి చెందారు. రెండు నెలలుగా అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ బుధవారం మరణించారు. నటరాజ్ మృతికి సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ, గ్రేటర్ హైదరాబాద్ కమిటీలు తీవ్ర సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించాయి. నటరాజ్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కోడళ్లు, మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. స్వతహాగా మృదు స్వభావిగా ఉన్న నటరాజ్ యూనియన్ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనే వారు. సీఐటీయూ అభివృద్ధికి ఆయన ఎంతగానో కృషి చేశారు. నటరాజ్ భౌతిక కాయానికి సీఐటీయూ నాయకులు జె.వెంకటేష్, ఎం.వెంకటేష్, జె.కుమారస్వామి, అజయ్‌బాబు, ఆర్‌ఈ బాబు తదితరులు నివాళులు అర్పించారు.

'ఇకపై సమర్థవంతమైన ప్రజాపాలన'



బంజారాహిల్స్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అహర్నిశలు కృషి చేసి ప్రజాసమస్యలపై దృష్టిసారించి ప్రజల ఆదరణను చూరగొని ఎంతో కష్టపడి రేవంత్‌రెడ్డికి తెలంగాణ మూడో ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించిన ఏఐసీసీ పెద్దలకు తెలంగాణ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలంగాణ ప్రజావేదిక అధ్యక్షుడు బండి సదానంద్‌గౌడ్ తెలిపారు. బుధవారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చింది రేవంత్‌రెడ్డి మాత్రమేనని ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు ఈ విషయాన్ని గుర్తించి ఆయనను ముఖ్యమంత్రిగా ప్రకటించడం హర్షణీయం అన్నారు. రేవంత్ నేతృత్వంలో రాష్ట్రం ప్రగతిపథంలో దూసుకెళ్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో తెలంగాణ ప్రజావేదిక కూడా కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. తాము కూడా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రచారంలో నిర్వహించామని కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని తాము చేసిన విజ్ఞప్తిని ప్రజలు మన్నించారన్నారు. సమర్థుడైన వ్యక్తికి రాష్ట్ర పగ్గాలు అప్పజెప్పారని అవినీతి, అక్రమాలు లేని పాలనను రేవంత్‌రెడ్డి అందిస్తారన్నారు. తెలంగాణ ప్రజావేదిక తరఫున కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రచారం నిర్వహించిన ప్రతీ ఒక్కరికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత సమర్థవంతమైన నాయకత్వాన్ని రేవంత్‌రెడ్డి రూపంలో చూడబోతున్నామన్నారు. ఇక నుంచి ప్రజాపాలన కొనసాగుతుందన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నా నాయక్ సమాచారం మేరకు... ఉందానగర్–జూకల్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి (60) మృతదేహం పడి ఉంది. మృతుడి ఒంటిపై వైట్ షర్టు, బ్లాక్ ప్యాంట్ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందు ఉంచేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. బుధవారం నాగోలు డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి ఆధ్వర్యంలో డివిజన్‌లో వివిధ కాలనీలకు చెందిన వారు సుధీర్‌రెడ్డి మరో సారి ఎమ్మెల్యే గెలిచిన సందర్భంగా సుధీర్‌రెడ్డి కలిసి అభినందనలు తెలియజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు దేప మధుసూదన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రవీంద్రర్‌రెడ్డి, శ్యామ్ సుందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో వివిధ కాలనీ చెందిన పలువురు కాలనీ వాసులు సుధీర్‌రెడ్డి కలిసి అభినందించారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గం ఎమ్మెల్యేగా మజ్లిస్ పార్టీ నుంచి నాలుగోసారి విజయం సాధించిన అహ్మద్ బలాలను బుధవారం మలక్‌పేట క్రిస్టియన్ అసోసియేషన్ నాయకులు పంజేషాహ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. బలాలను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రైస్తవులకు అండగా నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుత్తి సాల్మన్‌రాజ్, మహిళా విభాగం అధ్యక్షురాలు రాణిప్రమీల, సభ్యులు ఉన్నారు.

రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు


రేవంత్‌రెడ్డిని సత్కరిస్తున్న డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్, విద్యావేత్త మిరుదొడ్డి రాహుల్ రాజ్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కలిసి అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, మంత్రులు కృషి చేసి తెలంగాణ ప్రజల కలలను సాకారాం చేయాలని కోరారు. రైతులతో పాటు ఉద్యోగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని ఆకాంక్షించారు.

కాంగ్రెస్ పాలనలోనే ఉద్యోగులకు న్యాయం

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వ ఉద్యోగులకు సరైన న్యాయం జరుగుతుందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, 3194 ఐపీఎం బ్రాంచి అధ్యక్షుడు రాసూరి జ్ఞానేశ్వర్ అన్నారు. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనుండటంతో ఐపీఎం ఐఎన్‌టీయూసీ బ్రాంచి ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం బుధవారం నారాయణగూడలోని ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ సి.శివలీలను కలిసి స్వీట్స్ పంచారు. అనంతరం ఐపీఎం ప్రాంగణంలో టపాసులను పేల్చారు. ఐఎన్‌టీయూసీ ఐపీఎం నేతలు ఎం.రాజు, బంగ్లా సుశీల్ కుమార్, పి.సుధాకర్, ఆర్.నరేష్, టి.వెంకటేశ్వర్ రావు, సి.హెచ్.కృష్ణ మూర్తి, ఎం.డి.జైనుల్లాబుద్దీన్, ఎ.నర్సింహా, డి.మురళీదర్ రావు, పి.లక్ష్మణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అగ్రనేతలకు కృతజ్ఞతలు

నల్లకుంట: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఏర్పడబోయే కాంగ్రెస్ ప్రభుత్వం మెరుగైన పాలన అందిస్తుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ విభాగం వైస్ చైర్మన్ కట్టెల సుభాష్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం నల్లకుంట కూరగాయల మార్కెట్ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ సీనియర్ నేతలు ఎస్.హరినాథ్‌రెడ్డి, చింతల ధనార్జున్ రెడ్డిలతో కలిసి సుభాష్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డిని తెలంగాణ ముఖ్య మంత్రిగా ప్రకటించినందుకు తెలంగాణ ప్రదాత సోనియా గాంధీ, ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, మాణిక్ రావు ఠాక్రే, కర్ణాటక ఉప ముఖ్య మంత్రి డి.కె.శివకుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో తెలంగాణ గంగపుత్ర సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.రాజేష్, కాంగ్రెస్ నాయకులు సి.హెచ్.మురళీకృష్ణ, యాదగిరి (గిరి), కె.ప్రభుదాస్, మధుసూదన్, పెంటం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'నూతన ప్రభుత్వానికి అండగా ఉంటాం'

చాదర్‌ఘాట్: రాష్ట్రంలో ఏర్పడ్డ నూతన ప్రభుత్వానికి రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎస్ఎన్ చారి శుభాకాంక్షలు తెలిపారు. మలక్‌పేటలోని సంస్థ ప్రాంగణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నూతన ప్రభుత్వంలో వికలాంగుల సహకార సంస్థ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీని అమలు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి తమ ఉద్యోగుల అండదండలు ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రాములు, అడ్వైజర్లు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నింటా బీఆర్‌ఎస్‌కే ఆధిక్యం!

- భోలక్‌పూర్‌లో పది వేల మెజార్టీ
- గాంధీనగర్, కవాడిగూడ, అడిక్‌మెట్ డివిజన్‌లలో బీజేపీకి 2వ స్థానం
- భోలక్‌పూర్, ముషీరాబాద్, రాంనగర్‌లలో కాంగ్రెస్‌కు 2వ స్థానం

డివిజన్	పోలైనఓట్లు	బీఆర్‌ఎస్	బీజేపీ	కాంగ్రెస్	బీఆర్‌ఎస్‌లీడ్
గాంధీనగర్	22,635	9,803	6,755	5.331	3,048
కవాడిగూడ	27,520	12,725	7,168	6,544	5,557
భోలక్‌పూర్	30,099	17,651	3,890	7,707	9,944
ముషీరాబాద్	23,138	12,038	5,104	5,114	6,924
రాంనగర్	28,244	13,270	6,880	7,260	6,010
అడిక్‌మెట్	20,901	9,506	5,468	5,309	4,010

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రతి బూత్‌లో, ప్రతి రౌండ్‌లతో పాటు డివిజన్‌ల వారీగా కూడా బీఆర్ఎస్ తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించింది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీఆర్ఎస్ దరిదాపుల్లో కూడా లేకపోవడం గమనార్హం. ఈ నెల 3వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటికీ బూత్‌ల వారీగా ఏఏ పార్టీలకు ఎన్ని ఓట్లు వచ్చాయి, డివిజన్‌ల వారిగా ఏ పార్టీతో ఆధిక్యతను ప్రదర్శించాయో లెక్కలు తీయగా బీఆర్ఎస్ పార్టీ అన్ని పార్టీల కంటే ముందుంది. కీలకంగా మారిన, గెలుపు ఓటములను తారుమారు చేసే భోలక్‌పూర్ డివిజన్‌లో కూడా బీఆర్ఎస్ ఏకంగా పది వేల మెజార్టీ రావడంతో మైనార్టీలు కూడా బీఆర్ఎస్ పక్షానే ఉన్నారనేది తేటతెల్లమైంది.

- గాంధీనగర్, కవాడిగూడ, అడిక్‌మెట్ డివిజన్‌లలో బీజేపీ 2వస్థానంలో ఉండగా, భోలక్‌పూర్, ముషీరాబాద్, రాంనగర్ డివిజన్‌లలో కాంగ్రెస్ పార్టీ 2వస్థానంలో నిలిచింది. ఓవరాల్‌గా కాంగ్రెస్ పార్టీ బీజేపీ కంటే సుమారు 1900 ఓట్లను అధికంగా సాధించి రెండవ స్థానంలో నిలిచింది.
- పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్ పార్టీ(301) మొదటి స్థానంలో నిలవగా రెండవ స్థానంలో బీఆర్ఎస్(207), తృతీయ స్థానంలో బీజేపీ(177) నిలిచాయి. ఏ డివిజన్‌లో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయో ఈ కింది పట్టిక ద్వారా తెలుస్తుంది. అందులో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లేవు.